సాక్షి మంచిర్యాల

శనివారం, 3, జూన్, 2023



ఎస్టీపీపీలో షట్‌డౌన్ పనులు ముమ్మరం

జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు యూనిట్-1లో షట్‌డౌన్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. సీవోహెచ్(క్యాప్టల్ ఓవర్ హాలింగ్) పనులు ప్రారంభమయ్యాయి. 10లో▸

ఎరుకలకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

నస్పూర్: రాష్ట్రంలోని ఎరుకల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి బడ్జెట్ కేటాయించాలని తెలంగాణ ఎరుకల ప్రజాసమితి రాష్ట్ర అధ్యక్షుడు కెమసారం తిరుపతి డిమాండ్ చేశారు. నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. గిరిజన బంధులో ఎరుకలకు రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందించాలని అన్నారు. జిల్లా అధ్యక్షుడు ఉండాడి ఎల్లయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ దుగ్యాల సంతోష్, జిల్లా ఉపాధ్యక్షుడు కుర్ర రంజిత్ పాల్గొన్నారు.

గరిష్టం/కనిష్టం
42.0 /30.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. రాత్రివేళ పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఎండ తీవ్రత పెరిగి ఉక్కపోతగా ఉంటుంది. వడ గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

నేడు రైతు దినోత్సవం



వేడుకలకు ముస్తాబైన జన్నారం రైతువేదిక

మంచిర్యాలఅగ్రికల్చర్: తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం రైతు దినోత్సవం ఘనంగా నిర్వహించనున్నారు. జిల్లాలోని 55 వ్యవసాయ క్లస్టర్లలో వేడుకలకు సిద్ధం చేశారు. 2016 నుంచి 2023 వరకు జిల్లాలో వ్యవసాయ రంగంలో జరిగిన అభివృద్ధి, రైతులకు ప్రభుత్వం పథకాలు, సాగు, రుణమాఫీ, 24గంటల ఉచిత విద్యుత్, రైతుబంధు, బీమా పథకాల ద్వారా ఆర్థికంగా జిల్లాలో సాధించిన విజయాలపై వివరిస్తారు. ఉదయం తొమ్మిది గంటలకు క్లస్టర్ పరిధి గ్రామాల నుంచి రైతువేదికల వరకు ట్రాక్టర్లు, ఎడ్లబండ్లను అలంకరించి రైతులతో ర్యాలీ నిర్వహిస్తారు. జ్యోతి ప్రజ్వలన, జాతీయ గీతాలపన, వ్యవసాయ రంగంలో సాధించిన ప్రగతి సందేశం వినిపిస్తారు. రైతుబీమా ద్వారా లబ్ధి పొందిన కుటుంబాలతో మాటామంతి, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రజాప్రతినిధుల సందేశం, సేంద్రియ పద్ధతిలో విజయం సాధించిన రైతులకు సన్మానం, సామూహిక భోజన కార్యక్రమాలు నిర్వహిస్తారు.

కేసుల పరిష్కారానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న సివిల్ జడ్జి సంపత్

చెన్నూర్: చెన్నూర్ కోర్టు పరిధిలోని పోలీసుస్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కారమయ్యే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చెన్నూర్ సివిల్ జడ్జి సంపత్ అన్నారు. స్థానిక కోర్టు సమావేశ మందిరంలో పోలీసులు, న్యాయవాదులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల లీగల్ సెల్ ఆధ్వర్యంలో ఈ నెల 10న ఉదయం 10 గంటలకు చెన్నూర్ కోర్టులో లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు. కక్షిదారులు రాజీ పడే విధంగా పోలీసులు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. సమావేశంలో చెన్నూర్, కోటపల్లి, భీమారం, జైపూర్ పోలీసుస్టేషన్ల సీఐలు, వాసుదేవరావు, ఎస్సైలు, న్యాయవాదులు పాల్గొన్నారు.

వీవోఏల సమ్మె విరమణ

పాతమంచిర్యాల: తమ సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో 44 రోజులుగా చేస్తున్న సమ్మెను తాత్కాలికంగా విరమిస్తున్నట్లు ఐకేపీ వీవోఏలు ప్రకటించారు. ఈ మేరకు జిల్లా కేంద్రం మంచిర్యాలలోని జిల్లా గ్రామీణాభివృద్ధి కార్యాలయంలో డీఆర్‌డీఏ ఏపీడీ శ్రీనివాస్‌కు సమ్మె విరమణ పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వీవోఏ ఉద్యోగుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు దుంపల రంజిత్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు కుంటాల రాములు, కార్యదర్శి దుర్గం రాములు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి అంగన్‌వాడీ బాట

మంచిర్యాలటౌన్: అంగన్‌వాడీ కేంద్రాలకు ఐదేళ్లలోపు చిన్నారులు వచ్చేందుకు ఈ నెల 3 నుంచి 12వరకు అంగన్‌వాడీ బాట నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమ శాఖ అధికారి చిన్నయ్య తెలిపారు. 3న అంగన్‌వాడీ బాట, 4న బాలికల ఆరోగ్యం, పౌష్టికాహారం, ఆడపిల్లలకు చదువు ప్రాముఖ్యతను వివరిస్తారని తెలిపారు. 5న గర్భిణులకు శ్రీమంతాలు, 6న హరిత హారం, న్యూట్రీషియన్ గార్డెన్ల ఏర్పాటు, 7న పిల్లలకు అన్నప్రాసన, 8న అక్షరాభ్యాసం, 10న వెల్‌బేబి షో, గ్రోత్ మానిటరింగ్ డ్రైవ్ చేపట్టాలని పేర్కొన్నారు. 11న చిన్నారులు, మహిళలకు ఆటల పోటీలు, 12న మహిళా, శిశు సంక్షేమ శాఖ పథకాలు వివరించాలని తెలిపారు. 9న తెలంగాణ సంక్షేమ సంబరాలు, 13న మహిళా సంక్షేమ దినోత్సవ కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

వందశాతం అక్షరాస్యత సాధించాలి

మంచిర్యాలఅర్బన్: రాత్రిబడి కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగిస్తూ స్థానిక అండాలమ్మ కాలనీలో వందశాతం అక్షరాస్యత సాధించాలని డీఈవో యాదయ్య అన్నారు. గురువారం రాత్రి స్థానిక అండాలమ్మకాలనీలో వయోజన విద్య కేంద్రాలను ఆయన పరిశీలించి మహిళలకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వయస్సుతో సంబంధం లేకుండా వయోజన మహిళలు చదువు నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో వయోజన విద్యాశాఖ అధికారి పురుషోత్తం నాయక్, సఖి లయన్స్‌క్లబ్ అధ్యక్షురాలు అన్నపూర్ణ, జిల్లా వయోజన విద్య డీఆర్పీలు వెంకటేశ్వర్లు, అశోక్ రావు, అంగన్‌వాడీ టీచర్ శోభారాణి, కుట్టు శిక్షణ ఇన్‌స్ట్రక్టర్ జ్యోతి పాల్గొన్నారు.

అభివృద్ధికి పునరంకితం కావాలి

- దేశానికి ఆదర్శంగా రాష్ట్రాభివృద్ధి
- దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి
- ప్రభుత్వ విప్ బాల్క సుమన్



జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ సుమన్, పక్కన కలెక్టర్ సంతోష్, ఎమ్మెల్యే దివాకర్‌రావు



మాట్లాడుతున్న సుమన్



దశాబ్ది ఉత్సవాల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు





అమరుల స్తూపం వద్ద విప్ సుమన్ నివాళులు



తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల



అర్జున హార్ట్‌బీట్ విద్యార్థులకు ప్రశంసపత్రం

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రతి ఒక్కరూ బంగారు తెలంగాణ సాధనకు, తెలంగాణ అభివృద్ధికి పునరంకితం కావాలని ప్రభుత్వ విప్ బాల్క సుమన్ అన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవంలో భాగంగా శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. అంతకుముందు విప్ సుమన్ కలెక్టర్ బాదావత్ సంతోష్, జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, జిల్లా అదనపు కలెక్టర్లు మధుసూదన్‌నాయక్, రాహుల్, ట్రెయినీ కలెక్టర్ గౌతమి, మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, గ్రంథాలయ చైర్మన్ ప్రవీణ్‌లతో కలిసి అమరవీరుల స్తూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బైపాస్‌రోడ్డులోని తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల సమర్పించారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రభుత్వ విప్ సుమన్ ప్రసంగించారు. ఆయన మాటల్లోనే.. ఆత్మగౌరవ పోరాటానికి తెలంగాణ ఉద్యమం నిదర్శనం. స్వయంపాలన, నీళ్లు, నిధులు, నియామకాల కోసం జరిగిన రణంలో ప్రతి ఒక్కరూ కదం కలిపారు. స్వరాష్ట్ర సాధన అనంతరం తెలంగాణ తొమ్మిదేళ్ల కాలంలో అద్భుతాల సమాహారంగా మారింది. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో బంగారు తెలంగాణ అత్యద్భుత కట్టడాలకు నెలవైంది. కాళేశ్వరం మొదలుకుని నేటి సచివాలయం వరకు ఎన్నో ప్రాజెక్టులు, అధునాతన కట్టడాలు, చరిత్రాత్మక నిర్మాణాలు, సబ్బండ వర్ణాల సమగ్ర జీవన ప్రమాణాలు పెంచేందుకు సంక్షేమ, అభివృద్ధి యజ్ఞంతో తెలంగాణ ప్రగతి శిఖరాలుగా అబ్బురపరుస్తున్నాయి. జిల్లాలో 20 రోజులపాటు చేపట్టే దశాబ్ది ఉత్సవాలను అభివృద్ధి, సంక్షేమ పథకాలు, సాధించిన పురోగతి, ఘనకీర్తిని చాటేలా ఘనంగా నిర్వహిస్తాం.

నిరంతర విద్యుత్ సరఫరా

వ్యవసాయ రంగంలో రైతుబంధు, రైతుబీమా, నిరంతర ఉచిత విద్యుత్ సరఫరా, రైతు రుణమాఫీతోపాటు వ్యవసాయ విస్తరణాధికారుల నియామకం, రైతువేదికలు నిర్మించి అనేక సంస్కరణలు అమలు చేశాం. జిల్లాలో 2016లో 1,37,887 ఎకరాల సాగు విస్తీర్ణం ఉండగా 2023 నాటికి 4,45,429 ఎకరాలకు పెంచాం. రైతు బంధు పథకం ద్వారా 65 లక్షల మంది రైతులకు రూ.65 వేల కోట్ల మొత్తాన్ని పంట పెట్టుబడి సాయం కింద తెలంగాణ ప్రభుత్వం అందించింది. రైతుబీమా పథకం కింద మరణించిన రైతు కుటుంబానికి 10 రోజుల్లో రూ.5 లక్షల బీమా సొమ్మును అందిస్తోంది. జిల్లాలో ఇప్పటివరకు 1,702 మంది రైతులకు రూ.85 కోట్లు అందజేసింది. ధరణిలో ఉన్న 33 మాడ్యూల్స్ ద్వారా 29,750 దరఖాస్తులు రాగా 25,097 పరిష్కరించింది.



విద్యార్థినుల నృత్య ప్రదర్శన

- 2018 నుంచి 2023 వరకు 1,646 ఎకరాల విస్తీర్ణంలో రూ.60 లక్షల రాయితీతో ఆయిల్‌పామ్ విస్తరణ పథకం ద్వారా 475 మంది రైతులకు లబ్ధి జరిగింది. మందమర్రి మండలంలో రూ.500 కోట్ల వ్యయంతో నిర్మించ తలపెట్టిన ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీకి ఈ నెల 9 ముఖ్యమంత్రి కేసీఆర్ శంకుస్థాపన చేయడం సంతోషకరం.
- జిల్లా సహకార శాఖ పరిధిలో 1,550 సహకార సంఘాలు రిజిస్ట్రేషన్ చేయడంతో 20 వ్యవసాయ సహకార సంఘాల ద్వారా 2016 నుంచి ఇప్పటి వరకు 9.06 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశాం.
- మార్కెటింగ్ శాఖ ద్వారా రైతుల పంట ఉత్పత్తుల నిల్వకు రూ.37.50కోట్లతో మంచిర్యాల, చెన్నూర్, లక్సెట్టిపేట, జన్నారం, బెల్లంపల్లిలో గోదాములను ప్రభుత్వం నిర్మించింది. 2017 నుంచి 2023 వరకు 2.53 లక్షల మంది రైతుల ద్వారా 13,91,000 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రూ.313 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసింది.
- జిల్లాలో భారీ, మధ్య తరహా, చిన్ననీటి పారుదల ప్రాజెక్టుల ద్వారా రైతులు రెండు పంటలు పండించేందుకు నీరందించడం జరుగుతుంది. కడెం ఆయకట్టు, గూడెం ఎత్తిపోతలు, చెరువుల ద్వారా సాగునీరు అందిస్తున్నాం. ఈ నెల 9న సీఎం కేసీఆర్ రూ.90 కోట్లతో 10 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు పర్దాన్‌పల్లి ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేయనున్నారు.
- మత్స్యకారుల సహకార సంఘాల ఏర్పాటుతో పాటు 100 శాతం రాయితీపై 2016 నుంచి 2023 వరకు రూ.8.88 కోట్ల విలువైన చేపపిల్లలు, రూ.3.28కోట్ల విలువైన రొయ్యపిల్లలు విడుదల చేశాం.
- జిల్లా పంచాయతీ శాఖ పరిధిలో 548 పల్లెప్రకృతి వనాలు, 65 బృహత్ పల్లె ప్రకృతి వనాలతో పాటు 464 క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశాం.
- జైపూర్‌లో 1200 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంతోపాటు అదనంగా 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేశాం. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రామకృష్ణాపూర్‌లో రూ.1.50 కోట్లతో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేసి 11 వేల గృహాలకు నాణ్యమైన విద్యుత్ అందించడం జరుగుతుంది.
- సింగరేణి పారిశ్రామిక ప్రాంతంలో జీవో 76 ప్రకారం క్రమబద్ధీకరణ ప్రక్రియ ప్రభుత్వం ప్రారంభించింది. బెల్లంపల్లి, రామకృష్ణాపూర్, నస్పూర్ మున్సిపాలిటీల్లో ఇప్పటివరకు 18,480 దరఖాస్తులు రాగా 10,841 పట్టాలు పంపిణీ చేశాం.

నేటి నుంచి బడిబాట

- పాఠశాలల్లో మౌలిక వసతులపై ప్రచారం
- ప్రవేశాల సంఖ్య పెంపుపై దృష్టి

మంచిర్యాలఅర్బన్: మన ఊరు–మన బడి కార్యక్రమంలో ప్రభుత్వం పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తూ సుందరంగా తీర్చిదిద్దుతోంది. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అన్ని హంగులు, సౌకర్యాలు కల్పించింది. దీంతో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలపై విద్యాశాఖ దృష్టి సారించింది. ఈ నెల 3 నుంచి 17వరకు పాఠశాలల్లో కొత్త వి ద్యార్థుల ప్రవేశాల కోసం ఆచార్య జయశంకర్ బడిబాట కార్యక్రమం చేపడుతోంది. ఉదయం 7గంటల నుంచి 11 గంటల వరకు ఉపాధ్యాయులు బ్యానర్లు, పోస్టర్లు ప్రదర్శిస్తూ కరపత్రాలు పంచుతూ ఇంటింటా ప్రచారం చేస్తారు. సర్కారు బడుల్లో ప్రవేశాల సంఖ్య పెంచడమే ధ్యేయంగా ప్రత్యేక కార్యాచరణతో బడిబాట చేపట్టనున్నారు. జిల్లాలోని 714 ప్రభుత్వ, లోకల్‌బాడీ స్కూల్, 18 కేజీబీవీ, 5 ఆదర్శ పాఠశాలల్లో 47,680 మంది విద్యార్థులు చదువుతున్నారు. గతేడాది 3,880 మంది ఆంగ్ల మాధ్యమంలో, 107 మంది తెలుగు మీడియంలో ప్రవేశాలు పొందారు. ఈ ఏడాది తొమ్మిదో తరగతిలో ఆంగ్ల మాధ్యమం అమల్లోకి రానుంది. ఇప్పటికే 714 పాఠశాలల్లో 294 బడుల్లో తె లుగు, ఆంగ్ల మాధ్యమంలో బోధన సాగుతోంది. విద్యార్థులకు అన్నీ ఉచితంగానే అందిస్తోంది. ఉచిత ప్రవేశం, మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలు, రెండు జతల యూనిఫామ్, శిక్షణ పొందిన బోధన, విశాలమైన తరగతి గదులు, పాఠ్య, రాత పుస్తకాలు పంపిణీ సర్కారు బడిలో ఉన్నాయనే ప్రచారంతోపాటు వివిధ కార్యక్రమాలు చేపట్టనున్నారు.

తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తాం

ఆచార్య జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తాం. బడీడు పిల్లలను గుర్తించి సమీప పాఠశాలల్లో చేర్పించడం, పాఠశాలల్లో నమోదు శాతం పెంచడంతోపాటు గుణాత్మక విద్య అందించడం, బడి బయట పిల్లలను గుర్తించి వయస్సుకు తగిన తరగతుల్లో ప్రవేశం కల్పించనున్నాం. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదేళ్ల పిల్లలను గుర్తించి సమీప పాఠశాలల్లో చేర్పించడం జరుగుతుంది.

– యాదయ్య, డీఈవో, మంచిర్యాల

బలహీన వర్గాలకు అన్యాయం

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్



మాట్లాడుతున్న అద్దంకి దయాకర్

మంచిర్యాలటౌన్: ఏళ్ల తరబడి ఉద్యమాలు చేస్తే వచ్చిన తెలంగాణలో బడుగు బలహీన వర్గాల ప్రజలకు అన్యాయం జరిగిందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్ విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శుక్రవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కేవీ ప్రతాప్ ఆధ్వర్యంలో ఆయన నివాసంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా దయాకర్, ఆల్ ఇండియా ఆదివాసీ కాంగ్రెస్ వైస్ చైర్మన్ తేజావత్ బెల్లయ్యనాయక్ హాజరయ్యారు. సోనియాగాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అమరవీరులకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా దయాకర్ మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా జిల్లా రైతంగానికి చుక్క నీరు అందడం లేదని, రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తానని హామీని ఇచ్చి నిరుద్యోగులను మోసం చేశారని అన్నారు. ధరణి పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ, పేదల్లో ఒక్కరికి కూడా డబుల్ బెడ్‌రూం ఇల్లు ఇవ్వలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ కత్తి వెంకటస్వామి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గోమాస శ్రీనివాస్, దుర్గం భాస్కర్, వొడ్నాల శ్రీనివాస్, ఆవునూరి రాజ్‌కుమార్, హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్, లక్సెట్టిపేట జెడ్పీటీసీ ముత్తె సత్తయ్య, డాక్టర్ నీలకంఠేశ్వర్ రావు పాల్గొన్నారు.

మానసకు రాష్ట్ర గవర్నర్ ప్రశంసలు



మానసను అభినందిస్తున్న గవర్నర్

బెల్లంపల్లి: వాల్మీకి రామాయణం శ్లోకాలను పఠించి ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు సాధించిన బెల్లంపల్లికి చెందిన వేముల మానస అనే గృహిణి రాష్ట్ర గవర్నర్ తమిళిసై ప్రశంసలు అందుకున్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మానసను రాజ్‌భవన్‌కు ఆహ్వానించారు. ఈ మేరకు గవర్నర్ తమిళిసై మానసను శ్లోకాల వివరాలు అడిగి తెలుసుకుని అభినందించారు. మానస 1.30 గంటల వ్యవధిలో ఏకంగా 2,800 శ్లోకాలను పఠించి కొన్ని నెలల క్రితం వండర్ బుక్ ఆఫ్ రికార్డు సాధించింది. మానస భవిష్యత్‌లో మరింతగా ఎదగాలని గవర్నర్ ఆకాంక్షించారు.

జపాన్ పర్యటనకు విద్యార్థి ఎంపిక

కాసిపేట: మండలంలోని మల్కేపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థి జుమ్మిడి అంజన్న జపాన్ దేశ పర్యటనకు ఎంపికయ్యాడు. గతంలో ఫీడింగ్ చాంబర్ ప్రాజెక్టును ప్రదర్శించి జాతీయ స్థాయిలో ఇన్‌స్పైర్ మనాక్ అవార్డుల్లో నాలుగో స్థానం సాధించడంతో ఎంపిక చేశారు. సకుర సైన్స్ హైస్కూల్ ప్రోగ్రాం ఆఫ్ జపాన్ ద్వారా ఆ దేశాన్ని సందర్శించి అక్కడి నూతన సాంకేతికతను దగ్గరి నుంచి తెలుసుకునే అవకాశం కల్పించింది. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరసింహ విద్యార్థి అంజన్న, గైడ్ టీచర్ రమేష్, జిల్లా సైన్స్ అధికారి మధుబాబులను అభినందించారు. దహెగాం మండలం బీబ్రాకు చెందిన అంజన్న 10వ తరగతి మల్కేపల్లిలో పూర్తిచేయగా, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఈ సంవత్సరం ఇంటర్ పూర్తి చేశాడు.

నేటి నుంచి రేషన్ డీలర్ల సమ్మె

- దుకాణాల బంద్‌కు పిలుపు
- గౌరవ వేతనం, డిమాండ్లు పరిష్కరించాలని..
- బియ్యం పంపిణీ, సరఫరాకు బ్రేక్



అదనపు కలెక్టర్‌కు డీలర్ల సమ్మె నోటీసు(ఫైల్)

మంచిర్యాలటౌన్: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జిల్లాలోని రేషన్ డీలర్లు ఈ నెల 3నుంచి సమ్మె చేపట్టనున్నారు. గత నెల 16న జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్‌కు డీలర్లు సమ్మె నోటీసు అందజేశారు. రాష్ట్రంలోని రేషన్‌డీలర్లు 21 డిమాండ్లతో సమ్మె బాట పడుతున్నారని తెలుసుకున్న రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ డీలర్ల సంఘం నాయకులతో చర్చలు జరిపారు. 16కు పైగా డిమాండ్లను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి జూన్ ఒకటిలోగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీనివ్వడంతో సమ్మె ప్రకటనను విరమించుకున్నారు. శుక్రవారం వరకు మంత్రి నుంచి గానీ, పౌరసరఫరాల శాఖ నుంచి గానీ డిమాండ్ల పరిష్కారంపై ఎలాంటి ప్రకటన వెలువడకపోవడంతో శనివారం నుంచి రేషన్ దుకాణాలు తెరువొద్దని, సమ్మెబాట పట్టాలని జిల్లా చౌకధరల దుకాణాల డీలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్ణయించారు. దీంతో పేదలకు జూన్ నెల బియ్యం పంపిణీపై ప్రభావం పడనుంది. ఇదే నెలలో పాఠశాలలు, హాస్టళ్లు తెరుచుకోనుండగా బియ్యం సరఫరా నిలిచిపోనుంది. అంగన్‌వాడీ కేంద్రాలకు రేషన్ దుకాణాల ద్వారానే బియ్యం సరఫరా అవుతుండగా.. చిన్నారులకు పౌష్టికాహారం అందించడం కష్టమే. జిల్లాలో 423 రేషన్ దుకాణాలు, 2,19,453 ఆహార భద్రతకార్డులు, 423 మంది రేషన్ డీలర్లు ఉన్నారు.

ప్రధాన డిమాండ్లు ఇవే

డీలర్లకు రూ.30 వేల గౌరవ వేతనం ప్రకటించాలి. కరోనా మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి. మరిన్ని నిత్యావసర సరుకులు ప్రజలకు అందుబాటులోకి తెచ్చి రేషన్ దుకాణాన్ని మినీ సూపర్‌మార్కెట్లుగా తీర్చిదిద్దాలి. హెల్త్ కార్డులు జారీ చేయాలి. గన్ని సంచుల ధర రూ.28కి పెంచాలి. ఈ పాస్ సర్వర్‌డౌన్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి. గ్రామీణ ప్రాంతాల్లో 800 కార్డులు, పట్టణ ప్రాంతాల్లో 1200 కార్డులకు పైబడి ఉన్న రేషన్ షాపులను మాత్రమే విభజించాలి. కిలోకు 70 పైసల కమీషన్‌ను రూ.2కు పెంచాలి.

సమస్యలు పరిష్కరించాలి



రేషన్ డీలర్ల సమస్యలపై కొన్నేళ్లుగా డిమాండ్లు ఉన్నా నెరవేర్చకపోవడంతోనే సమ్మెబాట పడుతున్నాం. డీలర్లకు ప్రతి నెలా గౌరవ వేతనం కింద రూ.30 వేలు చెల్లించాలి. హెల్త్‌కార్డులను మంజూరు చేయడంతోపాటు రేషన్ దుకాణాలకు శాశ్వతంగా లైసెన్స్‌లు అందించాలి. బియ్యంతోపాటు ఇతరత్రా సరుకులు పంపిణీ చేసి మినీ సూపర్ మార్కెట్లుగా మార్చితే డీలర్లకు కొంత అదనంగా ఆదాయం సమకూరుతుంది.

– వంగపల్లి రవీందర్‌రావు, రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు

ఉద్యమకారులను మరిచిన బీఆర్‌ఎస్



ఉద్యమకారులను సన్మానిస్తున్న రఘునాథ్

మంచిర్యాలటౌన్: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడిన ఉద్యమకారులను బీఆర్‌ఎస్ పార్టీ మరిచిపోయిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి విమర్శించారు. జిల్లా కేంద్రంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం జిల్లాకు చెందిన తెలంగాణ ఉద్యమకారులను ఘనంగా సన్మానించారు. ఉద్యమంలో ఎదురైన అనుభవాలు, నాటి కాంగ్రెస్ ప్రభుత్వంతో పోరాడి తెలంగాణ సాధించుకోవడంపై గుర్తు చేసుకున్నారు. ఉద్యమకారులు కర్రె లచ్చన్న, గోనె శ్యాంసుందర్‌రావు, బాబన్న, చుంచు సదానందం, గురిజాల రవీందర్, మునీర్, పెద్దపల్లి పురుషోత్తం, సురేందర్‌చారి, కుమారస్వామి, నాగమల్ల ప్రకాశ్, రామగిరి రాజన్న, శివశంకర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

నిషేధిత పత్తి విత్తనాల పట్టివేత



నకిలీ విత్తనాలు చూపుతున్న ఏడీఏ సురేఖ

తాండూర్: మండలంలో శుక్రవారం విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, వ్యవసాయశాఖ అధికారులు ఓ వ్యక్తి వద్ద ప్రభుత్వ నిషేధిత పత్తి విత్తనాలు పట్టుకున్నారు. పక్కా సమాచారంతో తాండూర్‌కు చెందిన అల్లె నరేశ్ అలియాస్ నారాయణ వద్ద 15కిలోల నకిలీ విత్తనాలు స్వాధీనం చేసుకున్నారు. వీటిని తాండూర్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఐపీవోలు అనిల్‌కుమార్, వరుణ్‌ప్రమోద్, విజిలెన్స్ తహసీల్దార్ దినేశ్ చంద్ర, అధికారులు ఎం.అనిల్‌కుమార్, పీసీ సంపత్‌కుమార్, బెల్లంపల్లి ఏడీఏ సురేఖ, ఏవో కిరణ్మయి, సిబ్బంది ఉన్నారు.

ట్రాక్టర్ బోల్తా పడి యువకుడి మృతి

కౌటాల: మండలంలోని బోదంపల్లి గ్రామానికి చెందిన మోర్లె రాజేందర్ (20) అనే యువకుడు ట్రాక్టర్ బోల్తా పడి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మోర్లె పున్నయ్య–సావిత్రి దంపతులకు ముగ్గురు కుమారులు. చిన్నకుమారుడు రాజేందర్ కౌటాలలోని ట్రాక్టర్ గ్యారేజీలో మెకానిక్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం బోదంపల్లి గ్రామానికి చెందిన యాటకారి కమలాకర్‌కు చెందిన ట్రాక్టర్‌ను డ్రైవర్ పిడుగు వినోద్ గ్రామ శివారులో దుక్కి దున్నడానికి తీసుకెళ్తున్నాడు. ఈ క్రమంలో తన స్నేహితుడు పిడుగు సాయితో కలిసి రాజేందర్ ట్రాక్టర్‌పై వెళ్లాడు. దుక్కి దున్ని ముగ్గురు ఇంటికి వస్తున్న క్రమంలో ట్రాక్టర్‌ను ఒడ్డు ఎక్కించే క్రమంలో బోల్తాపడింది. దీంతో మోర్లె రాజేందర్‌పై ట్రాక్టర్ పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్ వినోద్ కాలు విరిగింది. సాయికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగ్రాతులను కాగజ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. రాజేందర్ తల్లిదండ్రులు మృతదేహంపై పడి బోరున విలపించారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి వివరాలు సేకరించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడి మృతి



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబీకులు

భీమిని: మండలంలోని తంగెళ్లపల్లి–వెంకటాపూర్ గ్రామాల మధ్య శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. వివరాలు.. తంగెళ్లపల్లి గ్రామానికి చెందిన రత్నం నాన్నయ్య (60) చీపురు కట్టలు అమ్ముకోవడానికి సూర్జాపూర్ గ్రామానికి నడిచి వెళ్తున్నాడు. ఈ క్రమంలో తంగెళ్లపల్లి–వెంకటాపూర్ గ్రామాల మధ్య గుర్తు తెలియని వాహనం ఢీకొట్టగా తల పగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. కుమారుడు వెంకటేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కన్నెపల్లి ఎస్సై నరేశ్ తెలిపారు.

పరిహారం కోసమే పక్కా ఇళ్లు

బెల్లంపల్లి/తాండూర్: బెల్లంపల్లి ఏరియా మాదారం ప్రాంతంలో సింగరేణి ప్రతిపాదించిన మహావీర్ ఖని (ఎంవీకే) ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్ట్ బొగ్గు తవ్వకాల అనుమతుల కోసం ఓ వైపు ప్రయత్నం జరుగుతుండగా మరోవైపు పరిహారం కోసం పక్కా ఇళ్ల నిర్మాణం జోరందుకుంది. గ్రామపంచాయతీ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేపడుతున్నారు. అక్రమ ఇళ్ల నిర్మాణాలను అడ్డుకోకపోవడం, పైగా వాటికి నంబర్లు కేటాయించడం అనుమానాలకు తావిస్తోంది.

- మహావీర్‌ఖని ఓసీపీ ప్రభావిత ప్రాంతంలో జోరుగా ఇళ్ల నిర్మాణాలు
- అక్రమంగా ఇంటినంబర్ల కేటాయింపు
- పరిహారం రాదంటున్న అధికారులు
- పరారీలో ఓ పంచాయతీ కార్యదర్శి
- అన్ని వైపులా ఒత్తిళ్లే కారణం
- అక్రమాలపై అధికారుల విచారణ



ఎంవీకే ఓసీపీ ప్రభావిత ప్రాంతంలో నిర్మించిన ఇళ్లు

రెండేళ్లుగా కొనసాగుతున్న తంతు

మహావీర్ ఖని ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు పరిధిలో మాదారం, మాదారం త్రీ ఇంక్లైన్, నీలాయపల్లి, తాండూర్ గ్రామపంచాయతీ పరిధిలోని కొంతభాగం ప్రభావిత ప్రాంతాలుగా సింగరేణి యాజమాన్యం గుర్తించింది. సింగరేణి ప్రతిపాదించిన ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీ భూములపై కొందరు కన్నేశారు. రెండేళ్లుగా ప్రభావిత భూభాగంలో ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. రైతుల నుంచి తక్కువ ధరకు భూమి కొనుగోలు చేసి ఇళ్లు నిర్మిస్తున్నారు. ఇంకొంత మంది రైతులతో ఒప్పందం చేసుకుని వందల సంఖ్యలో నిర్మాణాలు చేపట్టారు. పోచంపల్లి గ్రామశివారులో అసైన్డ్ భూమిలోనూ ఇళ్లు నిర్మించారు. వీటిలో సగానికి పైగా ఇళ్లకు నంబర్లు కూడా తీసుకున్నారు. ఈ వ్యవహారంలో భారీగానే డబ్బులు చేతులు మారినట్లు ప్రచారంలో ఉండగా నేటికీ ఇళ్ల నిర్మాణాలు ఆగకపోవడం గమనార్హం.

కొత్త ఇళ్లకు అనుమతి లేదు



ఎంవీకే ఓసీపీ ప్రతిపాదిత ప్రాంతాల్లో కొత్తగా నిర్మించిన ఇళ్లకు గ్రామపంచాయతీ నుంచి అనుమతి ఇవ్వబోం. ఇంటి నంబర్లు కేటాయించం. ఇప్పటికే కొత్త ఇళ్లకు కేటాయించిన నంబర్లను రద్దు చేస్తాం. ప్రాథమిక విచారణలో 50కి పైబడి ఇళ్లకు నంబర్లు కేటాయించినట్లు గుర్తించాం. సదరు పంచాయతీ కార్యదర్శిపై విచారణ జరుపుతాం. ప్రస్తుతం ఆ కార్యదర్శి పరారీలో ఉన్నారు. సింగరేణి నుంచి అధికంగా పరిహారం పొందాలనే ఉద్దేశంతోనే ఇబ్బడిముబ్బడిగా ఇళ్లు నిర్మిస్తున్నారు. అయితే రికార్డుల్లో నమోదైన ఇళ్లకు మాత్రమే పరిహారం అందించే అవకాశముంది.

– ఎ.ఫణీందర్‌రావు, డీఎల్పీవో, బెల్లంపల్లి

పరారీలో పంచాయతీ కార్యదర్శి

ఇష్టారీతిన కడుతున్న ఇళ్ల నిర్మాణాలను అడ్డుకోకుండా నిబంధనలకు విరుద్ధంగా ఇంటి నంబర్లు కేటాయించడంలో ఓ గ్రామపంచాయతీ కార్యదర్శి కీలకంగా వ్యవహరించినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు పలుసార్లు హెచ్చరించినట్లు తెలుస్తోంది. అయినా బేఖాతరు చేసి ఇంటి నంబర్లు కేటాయించారు. సదరు పంచాయతీ కార్యదర్శికి అన్ని వైపులా ఒత్తిళ్లు రావడంతో ఇటీవల పరారైనట్లు తెలుస్తోంది. అతడి అక్రమాలపై ప్రస్తుతం విచారణ చేస్తున్నట్లు సమాచారం. కొత్తగా మరో పంచాయతీ కార్యదర్శికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఇళ్ల నిర్మాణాలు చేపట్టకుండా ఈపాటికే రెండుసార్లు డీపీవో నుంచి ఉత్తర్వులు జారీ చేసినా మార్పు రావడం లేదు.

పరిహారం ఆశతోనే నిర్మాణాలు

ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్ట్ కింద భూములు కోల్పోయిన రైతులకు సింగరేణి యాజమాన్యం పరిహారం చెల్లిస్తుంది. ఖాళీగా ఉన్న భూములకు ప్రస్తుత మార్కెట్ విలువ అంచనా వేసి పరిహారం ఇస్తుంది. ఖాళీ భూమి కన్నా ఇళ్లు, వృక్షాలు, సాగుభూములకు అధికమొత్తంలో పరిహారం చెల్లించే అవకాశముంది. ప్రస్తుతం ప్రతిపాదిత ఓపీసీ ప్రాంతంలో ఖాళీ భూములే అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. కొంతమంది రైతులు కొద్దిపాటి విస్తీర్ణంలో ఆరుతడి పంటలు సాగు చేస్తుండగా చాలావరకు పడావుగా ఉన్నట్లు రెవెన్యూ రికార్డుల్లో నమోదైనట్లు సమాచారం. అయితే సింగరేణి యాజమాన్యం ఎంవీకే ఓసీపీని తెరమీదికి తీసుకురాగానే మాదారం త్రీ ఇంక్లైన్, నీలాయపల్లి, మాదారం గ్రామపంచాయతీల పరిధిలోని ఖాళీ భూముల్లో పోటాపోటీగా కొత్త ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించారు. పరిహారం చెల్లింపు విషయంలో సింగరేణి అధికారులు ఈ పాటికే క్లారిటీ ఇచ్చినా అక్రమ కట్టడాలు ఆగడం లేదు. గ్రామపంచాయతీ, రెవెన్యూ రికార్డుల్లో కొన్నేళ్ల క్రితం నమోదై ఉన్న ఇళ్లు, పంట భూములు, ఇతర స్థలాలకు మాత్రమే పరిహారం చెల్లిస్తామని, కొత్తగా నిర్మిస్తున్న ఇళ్లకు పరిహారం రాదని స్పష్టం చేసినా నిర్మాణాలు కొనసాగుతున్నాయి.

గొర్రెలు మేపడం ఇష్టంలేక యువకుడి ఆత్మహత్య



కుమార్ మృతదేహం

దండేపల్లి: మండలంలోని కాసిపేటకు చెందిన యువకుడు గొర్రెలు మేపడం ఇష్టం లేక ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. కాసిపేటకు చెందిన అల్లంల మల్లయ్య గొర్రెల కాపరి. తన కొడుకు కుమార్‌ను (24) గొర్రెలను మేపుకరావాలని పలుసార్లు కోరాడు. కానీ.. కుమార్‌కు గొర్రెలు మేపడం ఇష్టం లేదు. గురువారం కూడా గొర్రెలను మేపుకరావాలని మల్లయ్య కోరగా కుమార్ ఇంట్లోనే ఉన్నాడు. మనస్తాపానికి గురైన అతడు ఇంట్లోని గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని వెంటనే లక్సెట్టిపేట ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించగా కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యం తాగొద్దని మందలించినందుకు బాలుడు..



సంతోష్ మృతదేహం

తిర్యాణి: మద్యం తాగొద్దని కుటుంబసభ్యులు మందలించగా మనస్తాపంతో బాలుడు మృతి చెందిన ఘటన మండలంలోని అమీన్‌గూడ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. సొల్లు పోశం–రాజక్క దంపతుల రెండో సంతానమైన సంతోష్ (16) గ్రామంలో కూలీ పనులకు వెళ్తుంటాడు. వచ్చిన డబ్బులతో మద్యం సేవిస్తూ ఇంట్లో తరచూ గొడవపడేవాడు. గురువారం రాత్రి 9 గంటల సమయంలో మద్యం తాగి ఇంటికి వచ్చాడు. డబ్బులు కావాలని కుటుంబ సభ్యులతో గొడవకు దిగాడు. దీంతో వారు మద్యం మానేయాలని మందలించగా మనస్తాపంతో రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. ఎంతసేపైనా రాకపోవడంతో శుక్రవారం ఉదయం వెతకగా గ్రామ శివారులోని ఓ చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. మృతుడి తండ్రి పోశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అందజేత



మందమర్రిరూరల్: మొబైల్ ఇస్తున్న ఎస్సై



నస్పూర్: మొబైల్ అప్పగిస్తున్న ఎస్సై రాజేశ్

మందమర్రిరూరల్: కొద్దిరోజుల క్రితం రామకృష్ణాపూర్‌కు చెందిన పందుల రవి తన మొబైల్‌ను ఎక్కడో పోగొట్టుకున్నాడు. మందమర్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా మొబైల్‌ను గుర్తించారు. శుక్రవారం ఎస్సై చంద్రకుమార్ బాధితుడిని స్టేషన్‌కు పిలిపించి మొబైల్ అప్పగించారు. సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకుంటే మొబైల్ ఫోన్‌ని తిరిగి పొందే అవకాశం ఉందని తెలిపారు.

శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్‌లో..

నస్పూర్: శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొత్తరోడ్డుకు చెందిన కోలుగురి పూజ ఇటీవల తన మొబైల్‌ను పోగొట్టుకుంది. శ్రీరాంపూర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించారు. ఎస్సై రాజేశ్ శుక్రవారం బాధితురాలికి మొబైల్ అప్పగించారు. మొబైల్ ఫోన్లను గుర్తించడానికి టెక్ టీం హెడ్ కానిస్టేబుల్ చంద్రమోహన్, బ్లూ కోల్ట్స్ హెడ్‌కానిస్టేబుల్ సంపత్ కృషి చేశారని తెలిపారు.

రోడ్డు విస్తరణకు సహకరించాలి



భూయజమానితో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీలో రోడ్ల వెడల్పు కోసం చేస్తున్న అభివృద్ధి పనులు, రోడ్డు వెడల్పు పనులకు సహకరించాలని మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య కోరారు. జిల్లా కేంద్రంలోని బెల్లంపల్లి చౌరస్తాలో తన స్థలం నుంచి వేసిన రోడ్డును ఇటీవల భూయజమాని ఫెన్సింగ్ వేసి మూసివేయడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దీంతో శుక్రవారం సాయంత్రం మున్సిపల్ చైర్మన్ ఆధ్వర్యంలో వైస్ చైర్మన్ గాజుల ముఖేశ్‌గౌడ్, కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ మారుతీప్రసాద్, మున్సిపల్ ఇంజినీర్ మధుకర్ భూయజమానిని కలిసి రోడ్డు వెడల్పునకు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా భూయజమాని విజయ్‌మోహన్ మాట్లాడుతూ.. 45 ఏళ్లుగా తమ భూమికి సంబంధించి వివాదం ఉందని, తమ తండ్రి రామ్మోహన్‌రావు అడ్వకేట్ కావడంతో దీనిపై కోర్టుకు వెళ్లారని తెలిపారు. ఈ సమస్యకు కోర్టు పరిహారం ఇవ్వాలని తీర్పునిచ్చిందని గుర్తు చేశారు. రోడ్డు వెడల్పు విషయంలో తాము సహకారం అందిస్తున్నా తమకు అందించాల్సిన పరిహారం విషయంలో మాత్రం తాత్సారం చేస్తున్నారని తెలిపారు. అందుకే తమ స్థలంలోని హద్దుల్లో ఫెన్సింగ్ వేయాల్సి వచ్చిందని చెప్పారు. మార్కెట్ విలువ గజానికి రూ.15వేలు ఉండగా, బహిరంగ మార్కెట్‌లో రూ.1.50 లక్షల వరకు ఉందని తెలిసిందన్నారు. తనకు పరిహారం ఇస్తే భూమి ఇచ్చేందుకు ఎలాంటి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. చైర్మన్ వెంట కౌన్సిలర్లు మినాజొద్దీన్, వేముల సంజీవ్, గాదె సత్యం, పోరెడ్డి రాజు, మోతె సుజాత తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ భవన్‌లో ‘గుస్సాడీ’ ప్రదర్శన



గుస్సాడీ బృందాన్ని సన్మానిస్తున్న తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధి జగన్నాథం, భవన్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్

నార్నూర్(ఆసిఫాబాద్): జైనూర్ మండలం మార్లవాయి గ్రామానికి చెందిన పద్మశ్రీ అవార్డు గ్రహీత కనక రాజు గుస్సాడీ బృందానికి అరుదైన గౌరవం దక్కింది. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో శుక్రవారం ప్రదర్శన ఇచ్చారు. తెలంగాణ భవన్ వీరికి ప్రత్యేకంగా ఆహ్వానం పంపడంతో హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీ వెళ్లారు. సాయంత్రం 4 గంటలకు ఆదివాసీ నృత్యాలతోపాటు గుస్సాడీ నృత్యం, సంప్రదాయ వాయిద్యాలను ప్రదర్శించినట్లు బృందం కోఆర్డినేటర్ కనక వెంకటేశ్వర్‌రావు తెలిపారు. కాగా, గుస్సాడీ బృంద సభ్యులను తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధి మందా జగన్నాథం, భవన్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ ఘనంగా సన్మానించారు. జ్ఞాపికలను ప్రదానం చేశారు. గుస్సాడీ టీం రిసోర్స్ పర్సన్ కనక సుదర్శన్, సభ్యులు గేడం శ్రీధర్, జుగ్నాక ధర్మేందర్, మడవి మధురాజ్, ఆత్రం నూతన్, జుగ్నాక సోనేరావు, గేడం శంకర్, జుగ్నాక నందు, కనక రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

అట్టహాసంగా ఆవిర్భావ వేడుకలు



రామకృష్ణాపూర్: తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేస్తున్న అధికారులు, నాయకులు

శ్రీరాంపూర్: సింగరేణి ఆధ్వర్యంలో శుక్రవారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. నస్పూర్ కాలనీలోని తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేశారు. జీఎం కార్యాలయం వద్ద తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి, కంపెనీ అధికారులు, యూనియన్ నేతలు నివాళులర్పించారు. జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం జీఎం కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. జీఎం సతీమణి, సేవా అధ్యక్షురాలు రాధాకుమారి, ఇన్‌చార్జి ఎస్వోటూ జీఎం గోపాల్‌సింగ్, గుర్తింపు సంఘం ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు అబ్దుల్ ఖాదీర్, ఏరియా ఇంజినీర్ రమేశ్‌బాబు, ఏరియా రక్షణాధికారి శ్రీధర్‌రావు, డీజీఎంలు అరవింద్‌రావు, చిరంజీవి, శివరావు, చంద్రశేఖర్‌రెడ్డి, టీబీజీకేఎస్ నాయకులు మల్లారెడ్డి, లక్ష్మణ్, కుమారస్వామి, సేవా కార్యదర్శి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్‌లో..

రామకృష్ణాపూర్: పట్టణంలోని సింగరేణి ఠాగూర్‌స్టేడియంలో మందమర్రి జీఎం మోహన్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. సూపర్‌బజార్ సెంటర్‌లో తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేశారు. రామాలయంలోని అమరవీరుల స్తూపం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య, క్యాతనపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, యూనియన్ నాయకులు మేడిపెల్లి సంపత్, అక్బర్‌అలీ, బీ ఆర్ ఎస్ నాయకులు అబ్దుల్‌అజీజ్, గాండ్ల సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు. క్యాతనపల్లి మున్సిపల్ కార్యాలయం, ఆర్కేపీ గనులు, ఆయా పార్టీల కార్యాలయాల్లోనూ వేడుకలు నిర్వహించారు.

ఎస్టీపీపీలో..

జైపూర్: మండల కేంద్రంలోని 1200 మెగావాట్ల సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌లో ఎస్టీపీపీ అడ్మిన్ భవన కార్యాలయం వద్ద వేడుకలు నిర్వహించారు. ఎస్టీపీపీ ముఖ్య సలహాదారు సంజయ్‌కుమార్ సూర్ జాతీయ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సింగరేణి సీఎండీ శ్రీధర్ నేతృత్వంలో నిరంతరం జైపూర్ ఎస్టీపీపీ నుంచి విద్యుత్ ఉత్పత్తి చేస్తూ రాష్ట్రానికి అందిస్తున్నట్లు తెలిపారు. జీఎం సూర్యనారాయణరాజు, ఓఅండ్ ఎం చీఫ్ జెన్‌సింగ్, ఇన్‌చార్జి పీసీఎస్ జీఎం ఎంఎన్వీ రమణ, ఉద్యోగుల సంఘం కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు సముద్రాల శ్రీనివాస్, టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు చుక్కల శ్రీనివాస్, ఏజీఎంలు సత్యనారాయణ ప్రసాద్, సుధాకర్, శ్రీనివాసులు, డీజీఎం కేసా నారాయణరావు, పీఎం రామశాస్త్రి, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి ఏరియాలో..

రెబ్బెన(ఆసిఫాబాద్): గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో ఏరియా జీఎం దేవేందర్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అంతకుముందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం సింగరేణి గణనీయంగా అభివృద్ధి చెందిందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక చొరవతో ఉద్యోగులకు అనేక హక్కులు కల్పించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్వోటూ జీఎం గుప్తా, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్, పర్సనల్ మేనేజర్ లక్ష్మణ్‌రావు, ఏజీఎం తిరుమల్‌రావు, డీజీఎం సతీశ్ బాబు తదితరులు పాల్గొన్నారు.



గోలేటిలో జెండాకు వందనం చేస్తున్న జీఎం



శ్రీరాంపూర్: కేక్ కట్ చేస్తున్న జీఎం దంపతులు



జైపూర్: జెండా ఆవిష్కరిస్తున్న సంజయ్‌కుమార్‌సూర్

డంప్‌యార్డు పొగతో ఉక్కిరి బిక్కిరి

- మూడ్రోజులుగా వ్యాపిస్తున్న పొగ
- పట్టించుకోని అధికారులు



ఇండ్లలో కమ్ముకుంటున్న పొగ

డంప్‌యార్డు నుంచి వ్యాపిస్తున్న పొగ



చెత్త కుప్పలకు నిప్పంటించకుండా నిఘా పెట్టడంతోపాటు

బెల్లంపల్లి: మున్సిపల్ అధికారులు, పాలకుల పట్టింపులేని తనంతో పురప్రజలు పొగతో సతమతమవుతున్నారు. గడిచిన మూడురోజుల నుంచి వరుసగా ఎత్తివేతకు గురైన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పక్కన ఉన్న డంప్‌యార్డులో ఉన్న చెత్తకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో పొగ వ్యాపిస్తోంది. ఓ పక్క డంప్‌యార్డు చెత్త కుప్పల్లో మంటలు వ్యాపించగా అంతే తీవ్రతతో పొగ వ్యాపిస్తూ సమీప ఇళ్లలోకి చేరుతోంది. దీంతో శ్వాస తీసుకోవడానికి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. చిన్నారులు, వృద్ధులు, శ్వాసకోస సంబంధ సమస్యలున్నవారు పొగతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. చీకటి కాగానే డంప్‌యార్డులో మంటలు వ్యాపించడం, ఆ తర్వాత పొగ కమ్ముకోవడం వరుసగా మూడురోజులుగా కొనసాగుతోంది. కొత్త బస్టాండ్ ఏరియా, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంతం, కన్నాల బస్తీ, మధునన్ననగర్, టేకుల బస్తీ, ఫుట్‌గ్రౌండ్ బస్తీ, పాత బస్టాండ్ ఏరియా, కాంట్రాక్టర్ బస్తీ, రవీందర్‌నగర్, షంషీర్‌నగర్, బజారు ఏరియా తదితర ప్రాంతాల్లో పొగ ప్రభావం ఉంటోంది. రెండు నెలల క్రితం ఇదే తీరుగా డంప్‌యార్డులో మంట రాజుకుని తీవ్రమైన పొగ వ్యాపించగా స్థానికులు ఎంతో అసౌకర్యానికి గురయ్యారు. సమీప ఇళ్ల ప్రజలు పొగ ప్రభావంతో భోజనం చేయలేని పరిస్థితులు చవిచూశారు. స్థానికులు ఆందోళనకు సిద్ధమవుతున్న క్రమంలో అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ డంప్‌యార్డు నుంచి పొగరాకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో విరమించారు. ఆ ప్రాంతంలో చెత్త కుప్పలకు నిప్పంటించకుండా నిఘా పెట్టడంతోపాటు చెత్తాచెదారాన్నీ పడేయకుండా చర్యలు తీసుకుంటామని స్థానికులకు హామీ ఇచ్చి విస్మరించారు. ఎప్పటిమాదిరిగానే డంప్‌యార్డు నుంచి పొగ వ్యాపించగా భరించలేకపోతున్నారు. మున్సిపల్ కమిషనర్, చైర్‌పర్సన్ ఇతర ప్రజాప్రతినిధుల దృష్టికి స్థానికులు సమస్యను తీసుకువెళ్లినా స్పందించడంలేదనే ఆరోపణలున్నాయి. వీరు అనుసరిస్తున్న తీరుతో తీవ్ర ఆగ్రహావేశాలకు లోనవుతున్నారు. డంప్‌యార్డులో మంటలు లేవకుండా, పొగ వ్యాపించకుండా తక్షణ చర్యలు తీసుకుని శాశ్వత ప్రాతిపదికన డంప్‌యార్డును మరో ప్రాంతానికి తరలించాలని ఈ ప్రాంత ప్రజలు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు.